సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 22 । మే । 2025



మహిళా ఎస్ఐకు తప్పిన ప్రమాదం

మదనపల్లె రూరల్ స్టేషన్ మహిళా ఎస్ఐ గాయత్రి కారును ఐచర్‌వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్ఐకు పెనుప్రమాదం తప్పింది. -8లో



శిక్షణా కేంద్రం అభివృద్ధికి సహకరించండి

హార్సిలీ హిల్స్ లోని స్కాట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణా కేంద్రం అభివృద్ధికి సహకారం అందించాలని స్కాట్ అధికారులు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు విన్నవించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.80	రూ.100
రెండోరకం	రూ.60	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1130 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఏటీఎస్‌లలోనే వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

రాయచోటి టౌన్: ఇకపై వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లలో (ఏటీఎస్) పొందాల్సి ఉంటుందని జిల్లా రవాణా అధికారి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏటీఎస్ కేంద్రం సర్వే నంబర్ 1064 మాసాపేట, రాయచోటి జిల్లా హెడ్ క్వార్టర్ నుంచే నిర్వహించుకోవాలని సూచించారు. ఇకపై మ్యానువల్ పద్ధతి ద్వారా ఆర్‌టీవో కార్యాలయంలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించరని తెలిపారు. ఈ విషయం వాహనదారులు గమనించాలని కోరారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 2493 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: ఏపీ ఈఏపీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం రెండు సెషన్స్‌లో జరిగాయి. జిల్లావ్యాప్తంగా 2493 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కడపలో ఐదు పరీక్షా కేంద్రాలు, పొద్దుటూరులోని మూడు పరీక్షా కేంద్రాలకుగాను 2621 మంది అభ్యర్థులకుగాను 128 మంది గైర్హాజరయ్యారు. ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌కు సంబంధించి 95.12 శాతంగా హాజరు నమోదయింది.

జెడ్పీలో బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్‌లో సాధారణ బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 23, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్, తేది 15.05.2025 మేరకు ఈనెల 16 నుంచి జూన్ 2వ తేదీలోపు సాధారణ బదిలీలు జరగనున్నాయి. ఒకేచోట ఐదేళ్లు పూర్తయిన ఎంపీడీఓలు, మినిస్ట్రీరియల్, నాల్గవ తరగతి సిబ్బంది అధికారుల అనుమతితో రిక్వెస్ట్ బదిలీ దరఖాస్తులు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోపు జిల్లా పరిషత్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని సీఈఓ ఓబులమ్మ తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఐదేళ్లు సర్వీసు పూర్తయిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. ఏదైనా రిక్వెస్ట్, అడ్మినిస్టేటివ్ గ్రౌండ్స్ కింద బదిలీ కావాలని కోరుకునే వారు కూడా దరఖాస్తులు సమర్పించుకోవచ్చు. క్రమశిక్షణా చర్యలుగానీ లేదా శాఖాపరమైన చర్యలు ఉన్నవారు బదిలీకి అనర్హులవుతారు. సాధారణ బదిలీలపై వచ్చేనెల 3 నుంచి మళ్లీ నిషేధం అమలులోకి వస్తుంది.

ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో వేగం పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్. రమణ

కడప కార్పొరేషన్: రివాంపుడ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్‌డీఎస్ఎస్) కింద మంజూరైన పనులను వేగంగా పూర్తి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్. రమణ ఆదేశించారు. బుధవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద జరుగుతున్న పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో త్రీఫేస్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని తెలిపారు. ఈ పనులలో వేగవంతం పెంచాలని, తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు త్వరగా లబ్ధి చేకూరటమే కాకుండా విద్యుత్ వ్యవస్థ పటిష్ఠవంతంగా తయారవుతుందని తెలిపారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాయచోటి: మదనపల్లి మండలం, కోళ్లబైలు-1 గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.ద్వారకనాథ్‌నాయుడును జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సస్పెండ్ చేశారు. విధి నిర్వహణలో లంచం తీసుకొని మోసం చేయడంపై బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడ్డాయి.గతంలో వాల్మీకిపురం మండలం, కుర్నూతి సచివాలయంలో పనిచేస్తున్న సమయంలో కుర్నూతి గ్రామానికి చెందిన రెడ్డప్ప, హరీష్‌లకు ప్రధాన మంత్రి యోజన పథకం కింద రూ. 6 లక్షలు రుణం మంజూరు చేయిస్తామని రూ. 30 వేలు వారిద్దరి నుంచి తీసుకొన్నట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో నివేదికను అందజేయాలని మదనపల్లె ఎంపీడీఓను కలెక్టర్ ఆదేశించారు. రెడ్డప్ప, హరీష్‌లు ఆర్జీలో పేర్కొన్న విధంగా సదరు వెల్ఫేర్ అసిస్టెంట్ మోసం చేసినట్లు నిర్ధారణ చేస్తూ మదనపల్లె ఎంపీడీఓ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా సదరు వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. సదరు ఉద్యోగి సర్వీస్ రిజిస్టర్‌లో సస్పెన్షన్‌ను నమోదు చేయాలని మదనపల్లె మండల సహాయ సాంఘిక సంక్షేమ అధికారిణి ఆదేశించారు. ముందస్తు అనుమతి లేనిదే డి.ద్వారకనాథ్ నాయుడు గ్రామాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశాల్లో పేర్కొన్నారు. విధి నిర్వహణలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

ఇక పరేషన్



3 కిలో మీటర్లు వెళ్లాలి



తంబళ్లపల్లె మండలం కొత్తకురవపల్లెకు చెందిన గుల్జార్‌బీకి రేషన్‌కార్డు ఉంది. గతంలో ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలోని కే.రామిగానిపల్లె చౌక దుకాణం (షాప్ నంబర్ 10) వెళ్లి నిత్యావసరాలు తెచ్చుకునేది. భర్తతోపాటు కూలీ పనులు చేసుకుని జీవిస్తున్న ఆమెకు ఎండీయూ సేవలతో ఎంతో ఉపశమనం కలిగింది. కూలీకి వెళ్లినా ఎండీయూ వాహనం ఎప్పుడొస్తుందో ముందే చెప్పేవారు. కూలీపనికి వెళ్లినా మధ్యలో వచ్చి సరుకులు తీసుకునేవాళ్లు. తిరిగి చౌక దుకాణాల ద్వారా రేషన్ ఇస్తే తీసుకునేందుకు మూడు కిలోమీటర్లు వెళ్లాలి. అక్కడ డీలర్ ఎప్పుడు ఇస్తే అప్పుడు వెళ్లి క్యూలో నిలబడి గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని గుల్జార్‌బీ ఆవేదన వ్యక్తం చేస్తోంది.

- నిత్యావసర సరుకులకు డీలర్ల వద్ద మళ్లీ క్యూ కట్టాల్సిందే
- ఇంటిముంగిటకే ఇస్తున్న ఎండీయూ సేవలు నిలిపివేస్తూ కూటమి ప్రభుత్వ నిర్ణయం
- ఇకపై కిలోమీటర్ల దూరం వెళ్లాలి.. డీలర్లు ఎప్పుడిస్తే అప్పుడే వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి
- మళ్లీ పాతరోజులు వచ్చాయని లబ్ధిదారుల ఆవేదన



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ (ఫైల్)

జిల్లాలో ఎండీయూలు:	310
రేషన్‌కార్డులు:	4,97,998
చౌకదుకాణాలు:	1,123
మండలాలు:	30
మున్సిపాలిటీలు:	4
పంచాయతీలు:	501



మదనపల్లె: జిల్లాలో పౌరసరఫరాలశాఖ ద్వారా నిత్యావసరాలను పొందుతున్న పేదలు మళ్లీ కష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలతో ఇంటివద్దకే రేషన్ సరుకులు అందించగా ఇప్పుడు మళ్లీ గతంలో మాదిరిగా చౌకడిపోల వద్దే పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి, గంటల తరబడి రోడ్లపై నిరీక్షించాల్సిన పరిస్థితిని కూటమి ప్రభుత్వం మళ్లీ తీసుకొస్తోంది. ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చి ఇంటిముంగిటకే నిత్యావసరాల పంపిణీ కార్యక్రమానికి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోంది. ఏ ఇబ్బంది లేకుండా సరుకులు అందిస్తున్న ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) సేవలు ఇకపై అమలు చేయబోమని ప్రభుత్వం నిర్ణయించడంపై లబ్ధిదారులను విస్మయానికి గురిచేస్తోంది. గతంలో పడిన కష్టాలు మళ్లీ తమ ముందు కనిపిస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చేనెల నుంచి కిలోమీటర్ల దూరం వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుందని, దీనివల్ల ఒకరోజు ఉపాధి కోల్పోవడమేకాక చౌక డిపోల వద్ద క్యూ కట్టి పడిగాపులు తప్పవని సహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ అండతో యజమానులు

ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వీటి నిర్వాహకులను వాటికి యజమానులు చేసింది. పేదలైన ఆపరేటర్లకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇప్పించారు. ఒక్కో ఎండీయూ వాహనం విలువ రూ. 5,81,190. ఇందులో 10శాతం లబ్ధిదారులు బ్యాంకులకు చెల్లించగా మొత్తం సొమ్ముతో వాహనాన్ని అప్పగించారు. ఎండీయూ వాహనానికి వారే యజమానిగా ఉంటూనే ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న లబ్ధిదారునికి నెలసరి వేతనంగా రూ.21 వేలు నిర్ణయించి ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇందులో రూ3 వేలను కట్ చేస్తూ మిగిలిన జీతం ఖాతాలకు జమ చేయడం జరిగేది. ప్రస్తుతం ఈ వ్యవస్థను నిలిపివేస్తుండటంతో ఆపరేటర్లకు మరో ఉపాధి అవకాశం లేకపోతుంది.

రూ.18 కోట్లు వృథా



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఎండీయూ వాహనాల కొనుగోలు కోసం జిల్లాలో 310 వాహనాలకు రూ.18.01 కోట్లు ఖర్చు చేశారు. ఒక్కో వాహనం విలువ రూ.5,81,190. ఇందులో రాయితీ రూ.3,48,714, బ్యాంకు రుణం రూ.1,74,357, లబ్ధిదారుని వాటా రూ.58,119. ఈ మొత్తంతో వాహనాలు లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించింది. వాహనం ప్రతినెలా నడినందుకు రూ.21వేల వేతనం ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఎండీయూలను నిలిపివేస్తూ నిర్ణయించడంతో ఈ వాహనాలన్నీ మూలకు చేరడమేకాకుండా ఉపాధిని దెబ్బతీస్తున్నారు.

ఉపాధికి దెబ్బ!



సాక్షి రాయచోటి: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిరుద్యోగులపై కత్తి కడుతోంది. ఒకవైపు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను, మరోవైపు అంగన్వాడీ వర్కర్లను వేధిస్తూ ఇబ్బందులకు గురి చేసి వారంతట వారు వెళ్లిపోయేలా చేస్తోంది. ఇంకోవైపు రేషన్ ఎండీయూ వాహనాల్లో పనిచేసే ఆపరేటర్లు, హెల్పర్లను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తోంది. జూన్ నుంచి వాహనాలు తిరగకపోతే వారి పరిస్థితి ఏమిటన్నది అర్థం కావడం లేదు. జిల్లాలోని 310 వాహనాల్లో 620 మంది హెల్పర్లు, ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరందరూ ఇంటిదారి పట్టాల్సిందే. ఉపాధి కోల్పోతున్న వారిబాధ వర్ణనాతీతంగా మారింది. నెలకు రూ. 21 వేలు ప్రభుత్వం వేతనం కింద అందిస్తే అందులో రూ. 3 వేలు కంతు పోను మిగతా సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకునేవారు. కానీ కూటమి సర్కార్ ఉన్న ఫలంగా వాహనాలను పక్కన పెట్టాలని నిర్ణయించడంతో వారు మరొకమారు రోడ్డున పడనున్నారు. ఇప్పటికే వారికి ఉపాధి కల్పించాలని వైఎస్సార్‌సీపీతోపాటు వామపక్షాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి కల్పించాలి



ఎండీయూ వాహనాలను నిలిపివేయాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించాలి.ప్రస్తుతం పనిచేస్తున్న ఆపరేటర్లు, హెల్పర్లకు ఉపాధి కల్పించాలి. వైఎస్ జగన్ సర్కార్ ఉన్నతాశయంతో కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే రేషన్ సరుకులను తీసుకొచ్చింది. ఈ విధానాన్ని తొలగించడంతో కార్డుదారులు మళ్లీ సరుకుల కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని వైఎస్సార్ సీపీ తరుపున డిమాండ్ చేస్తున్నాం.

– ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే

వీధిన పడతాం



ఎండీయూ సేవలను నిలిపివేస్తే ఆధారపడిన వీధిన పడతాం.మా ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలి. 8వ తరగతి వరకు చదివిన తనకు మరో ఉపాధి అవకాశం లేదు. 2027 వరకు కొనసాగే అవకాశం ఉన్నా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అవస్థలు పడాల్సి వస్తుంది. ఆపరేటర్లకు ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలి. -నూర్ హర్షద్, ఆపరేటర్, రామసముద్రం

4 నెలలుగా అవస్థలు



4 నెలల నుంచి ఎండీయూ వాహనం రాకపోవడంతో 3 కిలోమీటర్ల దూరంలోని చల్లావారిపల్లెకు వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నాం.స్వగ్రామం పారేసువారిపల్లికి ఎండీయూ రాకపోయినాప్రభుత్వం పట్టించుకోలేదు.ఇకపై ఈ వాహనం రాకపోతే ఇబ్బందులు కొనసాగుతాయి. కూలీ పనులు వదిలి సరుకుల కోసం 3 కిలోమీటర్లు వెళ్లాలి. -రాజగోపాల్, పారేసువారిపల్లి, నిమ్మనపల్లె

బతుకు భారం



ఎండీయూల సేవలు నిలిపివేస్తే తమ బతుకులు భారం అవుతాయి. నిరుపేద అయిన తనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాహనం అందించి వేతనం ఇచ్చింది. దీంతో కుటుంబాన్ని పోషించుకొంటున్నాను. మరో వృత్తి తెలియని తమకు ఉపాధి అవకాశాలు దక్కవు. రోడ్డుపడాల్సి వస్తుంది. -పీ.రమణప్ప, ఆపరేటర్, బి.కొత్తకోట

ఐఎఫ్‌ఎస్‌కు అంబటి బాలాజీ



బాలాజీ

గాలివీడు: మండలంలోని బోరెడ్డిగారిపల్లెకు చెందిన అంబటి బాలాజీ ప్రతిభ కనబరచి యూపీఎస్సీలో 65 వ ర్యాంకు సాధించారు.కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) - 2024 తుది ఫలితాల్లో రెండు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా మొత్తం 143 మంది ఈ సర్వీసులకు ఎంపిక కాగా, వారిలో పది మందికి పైగా తెలుగు తేజాలు ఉండటం విశేషం.అందులో అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బోరెడ్డిగారి పల్లెకు చెందిన అంబటి బాలాజీ జాతీయ స్థాయిలో 65 వ ర్యాంకు సాధించి, తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తమ ర్యాంకర్‌గా నిలిచారు.ఈ సందర్భంగా బాలాజీ స్పందిస్తూ తన తాత అంబటి వెంకటరమణ , తల్లిదండ్రులు రఘునాథ, రామలక్షుమ్మ, అన్న వదిన లోకేష్,జ్యోత్స్న, అక్క బావ స్వాతి రవి చంద్ర భార్య గౌతమి కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందని అన్నారు. ఇంటర్ వరకు జవహర్‌లాల్ నవోదయ విద్యాలయం రాజంపేట, ఇంజినీరింగ్ (బీటెక్ -ఈసీఈ) ఎస్వీ యూనివర్సిటీలో పూర్తి చేశాక సివిల్స్ కు ఒక సంవత్సరం కోచింగ్ తీసుకున్నానని, తరువాత సొంత ప్రిపరేషన్ కొనసాగించానని చెప్పారు. 2020 లో గ్రామ వార్డు సచివాలయం పోటీ పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చిందన్నారు. కొద్దినెలలు మాత్రమే ఉద్యోగం చేసినట్లు చెప్పారు. తరువాత రిజైన్ చేసి మళ్లీ సివిల్స్ ప్రిపేర్ అయినట్లు తెలిపారు.2023 సివిల్స్ తరహాలోనే సెంట్రల్ గవర్నమెంట్‌లో ఈపీఎఫ్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో జాయిన్ అయ్యానని, ఇప్పుడు సివిల్స్ ఐఎఫ్ఎస్‌లో సెలెక్ట్ అయ్యానని తెలియజేశారు. ఐఏఎస్ సాధించాలన్నదే తన అంతిమ లక్ష్యమని, దానిని నెరవేర్చుకుంటానని ఆయన పేర్కొన్నారు.

యోగాతోనే శారీరక, మానసిక ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: శారీరక, మానసిక ఉరోగ్యం, భావోద్వేగాల సమతుల్యతలు యోగాతోనే సాధ్యమని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. జూన్ 21న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం రాయచోటిలోని మున్సిపల్ పార్కులో నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో నేటి నుండి జూన్ 21వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. .

జోనల్ మాస్టర్ ప్లాన్ కోసం నివేదికలు రూపొందించాలి


జిల్లా పరిధిలోని శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహ అభయారణ్యం, శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్క్ ప్రాంతాల ఏకో సెన్సిటివ్ జోన్ల నిర్మాణాలకు రూపొందించనున్న జోనల్ మాస్టర్ ప్లాన్‌కు వారంలోగా పటిష్టమైన నివేదికలను రూపొందించి, సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో సబ్ డీఎఫ్ఓ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని రాజంపేట, చిట్వేలి మండలాల పరిధిలో 185.42 చదరపు కిలోమీటర్ల మేర శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ అభయారణ్యం, ఓబులవారిపల్లి, కోడూరు, చిట్వేలి మండలాల పరిధిలో 87.02 చదరపు కిలోమీటర్ల మేర శ్రీ వెంకటేశ్వర నేషనల్ పార్కు విస్తరించి ఉందని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ హిత సున్నితమైన ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందిస్తోందన్నారు. ఇందులో భాగంగా గుర్తించిన ఎకో సెన్సిటివ్ జోన్ ప్రాంతాల్లో నిషేధించాల్సిన, ప్రమోట్, రెగ్యులేట్ చేయాల్సిన అంశాల్లో జోనల్ మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచడానికి వారంలోగా ఆయా శాఖలు తప్పనిసరిగా నివేదికలు సమర్పించాలన్నారు. అంతకు ముందు సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ సంస్థ రీజినల్ డైరెక్టర్ కె జయచంద్ర జోనల్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు సంబంధించి ఆయా శాఖలు దృష్టి సారించాల్సిన అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ సుబ్బరాజు పాల్గొన్నారు.



రాయచోటిలోని మున్సిపల్ పార్కులో నిర్వహించిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్.

రాజంపేట సబ్‌వేకి కదలిక!

- రూ.5కోట్లు కేటాయింపు
- స్థానికులలో చిగురించిన ఆశలు
- సబ్‌వేకి అప్రోచ్‌రోడ్డు ప్రశ్నార్థకరం
- ఫలించిన ఎంపీ మిథున్‌రెడ్డి కృషి



నిలిచిపోయిన రాజంపేట సబ్‌వే

రాజంపేట: పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్ యార్డులో అర్ధాంతరంగా ఆగిపోయిన సబ్‌వేకి కదిలికవచ్చింది. గుత్తి-రేణిగుంట రైలుమార్గంలో రాజంపేట యార్డు 103 లెవల్ క్రాసింగ్ గేట్‌కు ప్రత్యామ్నాయంగా నిర్మితం చేసిన సబ్‌వేకి రూ.5కోట్ల 22లక్షలు కేటాయించారు. దీంతో సబ్‌వే నిర్మాణం అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రాజంపేట సబ్‌వే నిర్మాణ విషయంలో నిధుల లేమితో వెనకడుగు వేసినట్లుగా స్థానికంగా విమర్శలున్నాయి.

దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ఆర్వోబీ

రాజంపేట రైల్వేగేటు సమస్య తీవ్రరూపం దాల్చిన క్రమంలో దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఆనాటి ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ, ప్రస్తుత ఎమ్మెల్యే, అప్పటి డీసీసీ అధ్యక్షునిగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి చొరవ కృషితో రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మితమైంది. రాజంపేట-రాయచోటి మార్గంలో ఇప్పుడు వాహనాల రాకపోకల సుగమమైంది.

ఆర్వోబీ ఇరువైపుల వారికి రాకపోకల సమస్య

ఆర్వోబి నిర్మించిన తర్వాత ఇరువైపుల ఉన్న ప్రాంతీయులకు రాకపోకల సమస్య ఉత్పన్నమైంది. రైల్వేగేటుకు ఇరువైపుల ఉన్న ప్రాంతాల వారికి ఆర్వోబితో నిమిత్తం లేకుండా ఆర్‌యూబీ నిర్మించాలని కోరారు. అయితే ఆర్వోబి ఉన్న చోట ఆర్‌యూబీ ఇచ్చే పరిస్థితులు లేని కారణంగా సబ్‌వే నిర్మితానికి ముందుకు వచ్చింది. రైల్వేశాఖ నిధులు కేటాయింపులు జరిగాయి. సబ్‌వే నిర్మితం తుదిదశకు చేరుకునేలా పనులు జరిగాయి. అనేక కారణాలతో సబ్‌వే నిర్మాణం మరుగునపడింది. ఇప్పటికి ఒకటిన్నర దశాబ్దకాలం అయింది.

వెంటాడుతున్న అప్రోచ్ రోడ్డు నిర్మాణ వ్యవహారం..

సబ్‌వే నిర్మాణానికి అప్రోచ్ రోడ్డు నిర్మాణవ్యవహారమే అడ్డంకీగా మారింది. సబ్‌వేకు అటు రాయచోటి వైపు, ఇటు రాజంపేట వైపు ఉన్న నిర్మాణాలు కారణంగా సబ్‌వే పూర్తికావడానికి బ్రేక్ పడింది. ఈ విషయంలో పురపాలకసంఘం, రోడ్లు భవనాల శాఖలు ఒకరిమీద ఒకరు చెప్పుకుంటూ కాలాన్ని వెళ్లదీసిన సంగతి తెలిసిందే. అలాగే సబ్‌వేకు ఇరువైపు ప్రాంతాలకు చెందిన వారు కొందరు కోర్టుకు కూడా వెళ్లిన సంగతి తెలిసిందే. కోర్టులో ఉండటంతో రెండు శాఖలు ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నారు. గతంలో సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన ప్రీతిమీనాతోపాటు అనేకమంది అధికారులు, ప్రజాప్రతినిధులు సబ్‌వే ప్రాంతాన్ని పరిశీలించిన సంగతి విధితమే.

రైల్వేమంత్రి, జీఎం,డీ ఆర్‌ఎం వరకు వినతులు

రైల్వేమంత్రిత్వశాఖ, దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజరు, గుంతకల్ రైల్వే డివిజనల్ మేనజరు వరకు రాజంపేట సబ్‌వే నిర్మాణం అంశం వెళ్లింది. సబ్‌వే నిర్మాణం పూర్తి కోసం ఆందోళనలు, నిరసనలు జరిగాయి. రాజంపేట లోక్‌సభ సభ్యుడుపీవీ మిథున్‌రెడ్డి ఇదే అంశాన్ని పలుమార్లు రైల్వేమంత్రిత్వశాఖ, ఎస్సీ రైల్వే జీఎం దృష్టి తీసుకెళ్లారు. ఫలితంగా 2025-2026 రైల్వే బడ్జెట్‌లో రాజంపేట సబ్‌వేకి రూ.5కోట్ల 22 లక్షలు నిధులు కేటాయింపులు జరిగాయి. ఈ మేరకు పింక్‌బుక్‌లో వెల్లడించారు.

సబ్‌వే అందుబాటులోకి రాక అనేక ఇబ్బందులు...

రాజంపేట 103 ఎల్సీగేట్ స్థానంలో సబ్‌వే నిర్మాణం అందుబాటులోకి రాక ప్రజలు, విద్యార్థులు, మహిళలు, ఇరువైపుల ఉన్న ప్రాంతీయులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌వేలో కనీసం ఆటో, బైకులు, పాదచారులు వెళ్లేందుకు అనుకూలంగా రైల్వేశాఖ నిర్మించినప్పటికి, రెండువైపు అప్రోచ్‌రోడ్డు వేసే అంశం చిరకాలంగా పెండింగ్‌లో పడిపోయింది. ఇటీవల గంగమ్మ జాతర సందర్భంగా సబ్‌వే అందుబాటులో లేకపోవడంతో వందలాది అనేక ఇబ్బందులు పడిన సంగతి తెలిసిందే. ఇప్పటికి పట్టాలు దాటి అవలివైపు వెళ్లాల్సి వస్తోంది.భవిష్యత్తులో రైల్వేట్రాక్‌కు ఫెన్సింగ్ వేస్తే ఇక దారి వుండదనే వాదన వినిపిస్తోంది. రైలుపట్టాలు దాటడం రైల్వేచట్టం ప్రకారంగా నేరమైనప్పటికి స్థానికులు తప్పనిపరిస్థితులో కొనసాగించాల్సి వస్తోంది.

సబ్‌వేను త్వరితగతిన పూర్తి చేయాలి



సబ్‌వే నిర్మాణవిషయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో త్వరితగతిని పూర్తి చేయాలి. రైల్వేబడ్జెట్‌లో రాజంపేట 103 లెవల్ క్రాస్ గేట్ స్థానంలో సబ్‌వే నిర్మాణానికి నిధులు కేటాయించడం హర్షణీయము. సబ్‌వేను అందుబాటులోకి తీసుకొస్తే ఆర్వోబికి ఇరువైపు ఉన్న ప్రాంతీయులు ఇబ్బందులు తీరుతాయి. -రెడ్డిమాసి రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీనేత, రాజంపేట

ఎంపీ మిథున్‌రెడ్డి కృషితోనే నిధుల కేటాయింపు



రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి రాజంపేట సబ్‌వే నిర్మాణ అంశాన్ని రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే సెక్షన్ అనేక ప్రాంతాల్లో ఆర్‌యూబీల నిర్మాణానికి కృషిచేశారు. ఇప్పుడు పెండింగ్‌లో ఉన్న సబ్‌వే నిర్మాణానికి రైల్వేంత్రి, జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ కృషి ఫలితంగా రైల్వేబడ్జెట్‌లో సబ్‌వే నిర్మాణానికి నిధులు కేటాయించారు.

-తల్లెంభరత్‌రెడ్డి, సభ్యుడు, గుంతకల్ డీఆర్‌యుసీసీ

కడప టీడీపీలో మినీవార్!

కడప రూరల్: కడప టీడీపీలో మినీ యుద్ధమే జరుగుతోంది. ఇన్నాళ్లు లోలోపల దాగి ఉన్న తమ్ముళ్ల అసంతృప్తి జ్వాలలు మినీ మహానాడు వేదికగా ఎగిసిపడ్డాయి. తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గం మినీ మహానాడు బుధవారం స్థానిక రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో పాటు మహానాడు పరిశీలకులు పత్తిపాటి కుసుమకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఆవేదనతో ఉన్నారని అన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారు బయట...పనిచేయని వారు లోపల ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి మృదుస్వభావని, ఈ అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే, చెపుతామంటారు..ఎప్పుడు చెపుతారో తెలియడం లేదన్నారు. రాష్ట్ర నేతలు వచ్చినప్పుడు ఎయిర్ పోర్ట్‌కు వెళితే నేను లోపలికి వెళ్లడం ఆలస్యమవుతోందన్నారు. అదే పార్టీకి ఏమాత్రం పనిచేయని వారు లోపలికి వెళ్లి దర్జాగా కూర్చుంటున్నారని అసంతృప్తిని వెళ్లగక్కారు. పార్టీ కార్యకర్తల మనోభావాలను పరిగణలోకి తీసుకొని పనిచేసే వారిని గుర్తించాలన్నారు.
- పార్టీలో తమ్ముళ్ల మధ్య పరిస్థితులు మారలేదు. మినీ మహానాడుకు ఆ పార్టీ సీనియర్ నేత లక్ష్మీరెడ్డి, మాజీ నగర అధ్యక్షుడు అమీర్‌బాబు, ప్రస్తుత నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి హాజరు కాలేదు. పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి వేదికపై లక్ష్మీరెడ్డి పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారంటూ ఒక ఆడియోను వినిపించారు. తరువాత ఆ ఆడియో మార్ఫింగ్ చేశారని లక్ష్మీరెడ్డి చెప్పడంతో పాటు శ్రీనివాసులరెడ్డిపై పలు ఆరోపణలు చేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. మినీ మహానాడు సందర్భంగానే ఇలా పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి.

క్లుప్తంగా

ఆంగ్ల పరీక్షకు 545 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 28 పరీక్షా కేంద్రాలలో 545 మంది పరీక్ష రాశారు. 259 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ షేక్ షంషుద్దీన్ మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయిని డీఈఓ తెలిపారు.

23 నుంచి తిప్పిరెడ్డిపల్లెలో వాహన ఫిట్‌నెస్ పరీక్ష

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 23 నుంచి పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లె వద్ద వాహన ఫిట్‌నెస్ పరీక్షలుంటాయని ఇన్‌చార్జి జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ను తిప్పిరెడ్డిపల్లెలో ఏర్పాటు చేశామని, ఇకపై రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షలు ఉండవన్నారు. కేంద్రం ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ ట్రాక్‌లోకి వెళ్లగానే అక్కడ ఏర్పాటు చేసిన కంప్యూటర్ సెన్సార్ల ద్వారా వాహన సామర్థ్య పరీక్షలు పరిశీలించి సర్టిఫికెట్ ఇస్తారన్నారు.

పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా చెన్నకృష్ణారెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా వీరం చెన్నకృష్ణారెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

పాఠశాల కూల్చివేత ఘటనపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఎస్ఐ కాంపౌండ్‌లో న్యూ మోడల్ స్కూల్‌ను కూల్చివేసిన సంఘటనలో పాఠశాల కరస్పాండెంట్ షర్మిల ఫిర్యాదు మేరకు 17 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. జాకోబ్, ప్రశాంత్, చందు, మరో 15 మంది నిందితులుగా వున్నారన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని లింగాపురంలో వద్ద ఎరుకల కాలనీలో పేకాడుతున్నారని సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ అరుణ్ రెడ్డి, సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 25 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.75 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

12 మందిపై కేసు నమోదు

కడప అర్బన్ : పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేయడంతో ఆందోళన చేసిన 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో రామరాజుపల్లెకు చెందిన విజయ్(22) తన కుమార్తె(17)ను బలవంతంగా తీసుకుని వెళ్లి వివాహం చేసుకున్నాడని జయమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విజయ్‌పై పోక్సో యాక్టు క్రింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అయితే తమకు అన్యాయం జరిగిందని మంళవారం రాత్రి నిందితుడి తల్లి, కుమార్తె వాస్మాల్ తాగి పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. దీంతో నిందితుడి తల్లిదండ్రులు, బంధువులు మొత్తం 12 మందిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూసార పరీక్ష.. పంట దిగుబడికి రక్ష

- జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో మట్టి నమూనాల సేకరణ ప్రారంభం
- జిల్లా లక్ష్యం – 24,288 నమూనాలు



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖాధికారులు

వల్లూరు : భూసార పరీక్షలను నిర్వహించుకుని భూముల స్వభావం, అందులోని పోషక విలువల ఆధారంగా తగిన పంటలను ఎంపిక చేసుకుని సాగులో మెలకువలు పాటించడం వలన అధిక దిగుబడులను సాధించడానికి అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ నిపుణులు తెలుపుతున్నారు. నేలలు తమలో సహజంగా ఇమిడి వున్న పోషక పదార్థాలతోబాటు మనం అదనంగా వేసే సేంద్రీయ , రసాయనిక ఎరువుల్లోని పోషకాలను పంటలకు అందజేస్తాయి. ఈ పోషక విలువలతో బాటు భూమిలోని చౌడు గుణం, సున్నం శాతం, నేల కాలుష్యం మొదలైన వాటి స్థాయిలను తెలుసుకోవడానికి భూసార పరీక్ష ఉపయోగపడుతుంది. అంతేగాక నేలల్లో వివిధ రకాల నేలలు వుండగా అందులో కొన్ని రకాల నేలల్లో ప్రత్యేకించి కొన్ని పంటలు సాగుకు అనుకూలంగా వుండి మంచి దిగుబడులు వస్తాయి. భూమి స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా అందుకు తగిన పంటలను సాగు చేసి మంచి ఫలితాలను పొందవచ్చు.

సాగు ఖర్చులు తగ్గించుకోవడానికి..

కనీసం రెండు లేక మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలను చేయించుకుని తమ పొలాల్లోని వివిధ పోషక పదార్థాల విలువలను తెలుసుకోవడం ద్వారా తగిన మోతాదులోనే ఎరువులను వాడడానికి అవకాశం ఉంటుంది. దీని వలన అవసరమైన పోషకాలను మాత్రమే పంటలకు అందించడం వలన అనవసర ఖర్చులను తగ్గించుకోవడానికి అవకాశాలు ఉంటాయి. అంతే కాక భూమిలో నిల్వ ఉన్న వివిధ పోషకాలను సమర్థవంతంగా వినియోగించుకుని ఆశించిన దిగుబడులను పొందవచ్చు.

సరైన పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తేనే ఫలితం..

కాగా భూసార పరీక్ష నిర్వహించడంలో సరైన పద్ధతిని పాటిస్తేనే సత్ఫలితాలు ఉంటాయి. కావున భూసార పరీక్షలు నిర్వహించేటపుడు రైతులు కొన్ని జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించడం వలన మంచి ప్రయోజనం ఉంటుంది.

- పొలంలో ఇంగ్లీషు వీ అక్షరం ఆకారంలో 15 సెం.మీ వరకు పారతో గుంత తీసి అందులో పై పార నుండి కింది పార వరకు ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- ఒక ఎకరా విస్తీర్ణంలో 8 నుండి 10 చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి 4 భాగాలుగా చేయాలి. అందులో ఎదురెదురుగా వున్న భాగాలను తీసుకుని మిగిలిన భాగాలను తీసి వేయాలి. ఇదే విధంగా మట్టి పరిమాణం 1/2 కిలో వచ్చే వరకు చేయాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, వేర్లు లేకుండా చేసి నీడలో ఆరబెట్టాలి.
- మట్టి నమూనా సేకరణకు రసాయనిక, సేంద్రీయ ఎరువులకు ఉపయోగించిన సంచులను వాడరాదు.
- గట్ల దగ్గర, పంట కాల్వలలో, చెట్ల కింద, ఎరువులను కుప్పలుగా వేసిన చోట, ఎప్పుడూ నీరు నిల్వ వుండే ప్రదేశంలో మట్టి నమూనాను సేకరించరాదు.
- పొలంలో చౌడు ప్రాంతం ఉన్నట్లైతే ప్రత్యేకంగా నమూనాను తీసి పంపాలి.
- పండ్ల తోటల సాగుకు పంట రకాన్ని బట్టి 3 నుండి 6 అడుగుల లోతు వరకు గుంతను తీసి ప్రతి అడుగుకు కొంత మట్టిని సేకరించి పంపాల్సి ఉంటుంది.

రైతులకు ఉపయుక్తంగా భూసార పరీక్షా పత్రాలు..

సేకరించిన మట్టి నమూనాలను అందుబాటులోని భూసార పరీక్షా కేంద్రాలకు పంపితే వారు పరీక్షలు నిర్వహించి వివిధ పోషక విలువల శాతాన్ని నమోదు చేస్తారు. వీటిని కార్డులలో పొందుపరిచి రైతులకు అందచేస్తారు. ఇందులో ఉదజని సూచిక, లవణ సూచిక, సేంద్రీయ కర్బణంలతో బాటు ప్రధాన పోషకాలైన నత్రజని, బాస్వరం, పొటాషియం, సూక్ష్మ ధాతు పోషకాలైన గంధకం, జింక్, బోరాన్, ఇనుము, మాంగనీసు, రాగి వంటి వాటి విలువల శాతాన్ని నమోదు చేస్తారు. దీనితో బాటు సాధారణంగా అవి ఉండాల్సిన శాతాన్ని బట్టి పరీక్షల్లో నమోదైన విలువల స్థాయిలను తక్కువ, ఎక్కువ, సాధారణం, మధ్యస్థం, అతి తక్కువ, అతి ఎక్కువ వంటి వివరాలతో సూచిస్తారు. వీటిని ఆధారంగా చేసుకుని పంటలకు వాడాల్సిన ఎరువుల మోతాదులను, వాడే విధానాలను సైతం సూచిస్తారు. ఇవి పాటించడం వలన రైతులు పంటల సాగులో ఖర్చులను తగ్గించుకుని నికర ఆదాయాన్ని పెంపొందిచుకునే అవకాశాలు వున్నాయి.

ఈ క్రమంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో భూసార పరీక్షల నిర్వహణకు గానూ మట్టి నమూనా సేకరణను ఇప్పటికే ప్రారంభించారు. గత ఏడాది మట్టి నమూనాల సేకరణ లక్ష్యం 17800 కాగా, 2025– 26 సంవత్సరానికి గానూ జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో మొత్తం 24,288 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

వ్యవసాయ డివిజన్‌ల వారీగా మట్టి నమూనాల సేకరణ లక్ష్యాలు ఇలా ఉన్నాయి

వ్యవసాయ డివిజన్	మండలాల సంఖ్య	నమూనాల సంఖ్య
కడప	6	3366
కమలాపురం	4	3300
పులివెందుల	5	3696
ముద్దనూరు	4	2674
ప్రొద్దుటూరు	4	3107
మైదుకూరు	4	2904
బద్వేలు	4	1814
పోరుమామిళ్ల	5	3427
మొత్తం	36	24,288

భూసార పరీక్షతో ప్రయోజనాలు..



భూసార పరీక్ష చేయించుకుని నేల స్వభావాన్ని బట్టి పంటలను సాగు చేయడం వలన మంచి ఫలితం ఉంటుంది. భూమిలోని పోషకాల విలువలను తెలుసుకోవడం ద్వారా అవసరమైన పోషకాలను మాత్రమే ఎరువుల రూపంలో వాడవచ్చు. దీంతో అనవసర ఖర్చులను తగ్గించుకోవడానికి అవకాశం ఉంది.

– ఏవీ నరసింహారెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, కమలాపురం

కళాశాల గదుల వేలం వాయిదా

అధికార పార్టీ నేత ఒత్తిడే కారణమా?



వేలంపాట వాయిదా వేయడంతో వెనుదిరిగి వెళ్తున్న పాటదారులు

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని మలయాళస్వామి బీఈడీ కళాశాల గదుల వేలంపాట వాయిదా పడింది. పర్యవేక్షణ అధికారి రాకపోవడంతో వాయిదా వేశామని ఈఓ రామచంద్రాచార్యులు ప్రకటించారు. దీంతో దేవాదాయ శాఖకు మరింత నష్టం వాటిల్లినట్లయింది. అయితే స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధి ప్రమేయంతోనే వేలంపాట నిర్వహించలేదని, కళాశాల నిర్వాహకులకు అనుకూలంగా సదరు ప్రజాప్రతినిధి వ్యవహరించి ఫోన్ చేయడంతోనే వాయిదా వేశారని చర్చ సాగుతోంది. బహిరంగ వేలం నిర్వహిస్తే ఈ గదులకు నెలకు రూ.లక్ష వరకు ఆదాయం లభించే అవకాశం ఉన్నా.. అధికారుల తీరుతో అందకుండాపోయింది.

ఏడేళ్లుగా అద్దె చెల్లించలేదు

దేవాదాయ శాఖ ఆధ్వర్యం శ్రీకృష్ణ గీతాశ్రమంలో 7,744 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో మలయాళ స్వామి బీఈడీ కళాశాల నిర్వహిస్తున్నారు. ఈ భవనాలకు ఏడేళ్లుగా కళాశాల నిర్వాహకులు అద్దె చెల్లించడం లేదు. కళాశాల యాజమాన్యం గతంలో కోర్టును ఆశ్రయించడంతో గత ఏడాది సెప్టెంబర్ 11న అప్పీల్‌ను కోర్టు కొట్టివేసింది. దీంతో ఈఓ ఏడేళ్ల బకాయిలు రూ.7 లక్షలు చెల్లించాలని పలుమార్లు నోటీసులిచ్చినా నిర్వాహకులు స్పందించలేదు. నాలుగు రోజుల కిందట కళాశాల భవనాలను ఈవో సీజ్ చేసి వేలం నిర్వహిస్తామని ప్రకటన విడుదల చేశారు. విషయం తెలుసుకున్న కళాశాలల నిర్వాహకులు వేలం పాటలో పాల్గొనేందుకు గీతాశ్రమానికి వచ్చారు. అయితే పర్యవేక్షణ అధికారి రాకపోవడంతో వాయిదా వేశామని ఈఓ తెలిపారు. పది రోజుల తర్వాత తిరిగి వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గతంలోనూ ఇలాగే..

దేవాదాయశాఖకు సంబంధించిన గదులను లోపాయికారీ ఒప్పందాలతో తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. వేలం పాట నిర్వహణను పరిశీలించేందుకు బుధవారం ఆయన ఇక్కడికి వచ్చారు. ఈఓతో ఆయన మాట్లాడుతూ గతంలోలాగే జరుగుతోందని ఇక్కడికి వచ్చానని, ప్రస్తుతం అదే రీతిన వేలం పాట నిర్వహించకుండా వాయిదా వేశారని అన్నారు. గతంలో వేలం జరిపినట్లు రికార్డులు తయారుచేసి అతి తక్కువ బాడుగకు ఇచ్చారని ఆయన తెలిపారు. ఎవరైతే ఆశ్రమానికి వ్యతిరేకంగా కోర్టులో కేసులు వేశారో వారికే రూములను అప్పజెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పది రోజుల తర్వాత అయినా పారదర్శకంగా వేలం పాట నిర్వహించాలని ఈఓను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా దేవాదాయశాఖ ఆదాయానికి గండి కొట్టొద్దని తెలిపారు. ఇలా జరిగితే న్యాయ పోరాటం చేస్తానన్నారు.

శిక్షణా కేంద్రం అభివృద్ధికి సహకరించండి



సబ్ కలెక్టర్‌ను కలిసిన స్కాట్ అండ్ గైడ్స్ అధికారులు

మదనపల్లె రూరల్ : హార్సిలీహిల్స్‌లోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం అభివృద్ధికి సహకరించాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు కోరారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, స్కౌట్ అధికారులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌ను ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1959 మే, 23న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ భీమసేన్ సాచార్ హార్సిలీహిల్స్‌లోని శిక్షణ కేంద్రానికి స్థలాన్ని కేటాయించడం జరిగిందని వివరించారు. అప్పటి నుంచి 8 జిల్లాలకు చెందిన రాయలసీమ విద్యార్థులేగాక, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు శిక్షణ పొందడం జరిగిందన్నారు. ప్రహరీ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని, స్కౌట్ భవనానికి నీటి సరఫరా పునరుద్ధరించాలని కోరారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ హార్సిలీ హిల్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థలానికి సంబంధించిన వివరాలు తెప్పించుకుని దాని అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, జాయింట్ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ మహమ్మద్ ఖాన్, బేసిక్ స్కౌట్ మాస్టర్స్ చంద్రశేఖర్ రెడ్డి, అన్వర్ బాషా, లక్ష్మీపతి, కబ్ మాస్టర్స్ భూపతి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైల్వే కోడూరు అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యూత్ వింగ్ అధ్యక్షుడిగా జి.శివకుమార్, ఇ.లక్ష్మీనారాయణమ్మ(మహిళా విభాగం), కె.ఆంజనేయులురెడ్డి(రైతు విభాగం), ఎన్.ప్రభాకర్(బీసీ విభాగం), టి.దుర్గయ్య(ఎస్సీ విభాగం) కోట రత్నమ్మ(ఎస్టీ విభాగం) షేక్ మదనపల్లె రాఫాన్(మైనార్టీ విభాగం), బి.ప్రదీప్‌రాజ్‌కుమార్(క్రిస్టియన్ మైనార్టీ విభాగం), ఎల్.మౌనీంద్రకుమార్‌రెడ్డి(విద్యార్థి విభాగం), ఎస్.శివశంకర్‌డ్డి(పంచాయతీరాజ్ విభాగం), యనమల చైతన్య(ఆర్టీఐ విభాగం) పి.శివశంకర్(వలంటీర్ల విభాగం), ఎల్.గంగరాజు(గ్రీవెన్స్‌సెల్ విభాగం), జి.రమేశ్‌బాబు(వాణిజ్య విభాగం), సారథి(చేనేత విభాగం), ఎస్.సతీష్‌రెడ్డి(వైఎస్సార్‌టీయూసీ), ఎస్.మధుసూదనరావు(లీగల్ విభాగం), పి.జయరాం(సాంస్కృతిక విభాగం), డి.సాయిగణేశ్(సోషల్ మీడియా విభాగం), బి.సుబ్రహ్మణ్యం(ఐటీ విభాగం), జె.నరసింహులు(దివ్యాంగుల విభాగం), ఒ.వేణుగోపాల్‌రెడ్డి(డాక్టర్ల విభాగం), మోహన్‌ప్రసాద్‌గౌడ్(మేధావుల ఫోరం), టి.నాగభూషణం(బూత్ కమిటీ విభాగం), డి.సుదర్శన్(ప్రచార విభాగం)లను ఆయా విభాగాలకు అధ్యక్షులుగా నియమించారు. మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా కె.వెంకట రమణారెడ్డిని నియమించారు.

ముత్తూట్ సిబ్బంది చేతివాటం

– సొమ్ము స్వాహా కేసులో ముగ్గురి అరెస్టు

బి.కొత్తకోట : ముత్తూట్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. స్థానిక రంగసముద్రంరోడ్డులోని ముత్తూట్ ఫైనాన్స్ శాఖలో సొమ్ము జమచేయకుండా స్వాహా చేశారు. ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు అందడంతో ముగ్గురు ఉద్యోగులను అరెస్టు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ లక్ష్మన్న తెలిపారు. ఆయన కథనం మేరకు..ఫైనాన్స్ సంస్థ బ్రాంచ్‌లో మదనపల్లెకు చెందిన దూదేకుల ఇమ్రాన్‌బాషా(30), పెద్దతిప్పసముద్రం మండలం మల్లెలకు చెందిన జరిపిటి హరీష్(29), బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీకి చెందిన ముగిలన్నగారి హరికృష్ణ (26) వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. కార్యాలయంలో బంగారు ఆభరణాలను కుదవపెట్టే ఖాతాదారులతో సొమ్ము వసూలు చేసినా.. బ్రాంచీలో జమ చేయకుండా స్వాహా చేస్తున్నారు. కొందరు ఖాతాదారులు ఇటీవల నగలు విడిపించుకునేందుకు రాగా ఇంకా రుణం పెండింగ్‌లో ఉందని, చెల్లిస్తే ఇస్తామని చెప్పడంతో ఖంగుతిన్నారు. ఈ విషయం దావానలంలా అందరికీ తెలియడంతో కొందరు ఖాతాదారులకు అనుమానం కలిగి తమ రుణాలపై ఆరా తీయగా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ విషయం సంస్థ ఉన్నతాధికారులకు చేరడంతో విజిలెన్స్ బృందంతో విచారణ చేయించారు. అనుమానించినట్టుగానే ఆ ముగ్గురు సిబ్బంది రూ.65.76 లక్షలు ముత్తూట్ సంస్థకు జమ చేయకుండా స్వాహా చేశారని తేలడంతో చర్యలు చేపట్టారు. రీజనల్ ఫైనాన్స్ మేనేజర్ ఎస్.దేవరాజు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి ముగ్గురిని మండలంలోని హార్సిలీహిల్స్ క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఉపకరణాలు

కడప ఎడ్యుకేషన్ : విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక ఉపకారణాలు అందించినట్లు జోన్ 4 పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) కాగిత శామ్యూల్ అన్నారు. స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు బుధవారం ఉపకారణాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అలింకో ఉపకరణాలు తయారుచేసి అందిస్తోందన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అర్హులను గుర్తించి వీల్ చైర్స్, సీపీచైర్స్, రోలేటర్స్ అందించామని తెలిపారు. ఉపకారణాలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ప్రత్యేక ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ నిత్యానంద రాజు, విభిన్న ప్రతిభవంతుల శాఖ జిల్లా సంచాలకులు కృష్ణ కిశోర్ మాట్లాడుతూ ఉపకరణాలతో దివ్యాంగులు తమ లోపాలు అధిగమించి రాణించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, రమణమూర్తి, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, వీరేంద్ర, మమత, విజయమ్మ, పద్మ, గంగులప్ప, చంద్ర, రాజా, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఎస్ఐకు తప్పిన ప్రమాదం

ఎస్ఐ కారును ఢీకొని బోల్తా పడిన ఐచర్ వాహనం





గాయపడిన వెంకటరమణ, ఎస్ఐ గాయత్రి



దెబ్బతిన్న ఎస్ఐ కారు

కురబలకోట : మహిళా ఎస్ఐ కారును ఐచర్‌వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్ఐకు పెనుప్రమాదం తప్పింది. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ వివరాల మేరకు.. మదనపల్లె రూరల్ స్టేషన్ మహిళా ఎస్ఐ గాయత్రి బుధవారం తంబళ్లపల్లె కోర్టుకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి కారులో మదనపల్లెకు బయలుదేరారు. కడప క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా టమాటా లోడ్‌తో వచ్చిన ఐచర్ వాహనం ఎస్ఐ కారును రెప్పపాటున రాసుకుంటూ వెళ్లింది. ఈ క్రమంలో ఐషర్ వాహనాన్ని డ్రైవర్ కంట్రోల్ చేసే క్రమంలో అదుపుతప్పి బోల్తాపడింది. అక్కడే బస్సుకోసం వేచి ఉన్న చౌటకుంటపల్లెకు చెందిన రెడ్డెమ్మ(50), నారేవాండ్లపల్లెకు చెందిన అరుణమ్మ(56), కలకడ మండలం పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటరమణ(65)లకు తీవ్ర గాయాలయ్యాయి. ముదివేడు టోల్‌ప్లాజా సిబ్బంది వారిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మహిళా ఎస్ఐ గాయత్రికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఆమెను సమీపంలోని ముదివేడు స్టేషన్‌కు తరలించి.. ఆ తర్వాత మదనపల్లె పట్టణంలోని ఇంటికి పంపారు. ఈ సంఘటనపై డ్రైవర్‌పై కేసు నమోదుచేసి ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. అయితే బస్టాపు వద్ద ప్రయాణికులు ఎక్కువమంది వేచి ఉండడంతో వారిపై లారీ పడి ఉంటే పెద్ద ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

వల్లూరు : మండలంలోని కొప్పోలు బస్టాపు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు... పిఠాపురానికి చెందిన కూలీలు కుమారునిపల్లె సమీపంలో ని ఇటుకల బట్టీల వద్ద పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి వల్లూరు బస్టాపు వద్దకు భోజనానికి వెళుతుండగా.. కొప్పో లు బస్టాపు సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో కూలీల్లో ఒకరైన చరణ్ గాయపడ్డాడు. అదుపు త ప్పి కింద పడడంతో వాహనదారుడికి గాయాలయ్యాయి. 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామసముద్రం మండలం గుండెవారిపల్లెకు చెందిన వాలెప్ప(50) మనస్తాపంతో.. పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వాలెప్ప కుమారుడు మణికంఠ తండ్రికి తెలియకుండా రూ.2.5 లక్షలు అప్పు చేశాడు. రెండు రోజుల క్రితం రుణదాతలు ఒత్తిడి చేయడంతో వాలెప్ప రూ.60 వేలు చెల్లించారు. అయినా నగదు కోసం వారు పట్టుపట్టడంతో, అవమానంగా భావించిన ఆయన ఇంటిలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు బాధితుడిని మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన జయమ్మ (50) కుటుంబ సమస్యలతో జిల్లేడు పాలు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన అమ్మాజాన్

ములకలచెరువు : ద్విచక్ర వాహనాన్ని టమాటా లారీ ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందిన విషాదకర సంఘటన బుధవారం సాయంత్రం మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని దేవళ చెరువుకు చెందిన షమీ, అమ్మాజాన్ దంపతులు వారి కుమార్తెతో కలిసి వ్యక్తిగత పనిపై ములకలచెరువుకు వె వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా వేపూరికోట క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న టమాటా లారీ ఢీకొంది. ప్రమాదంలో అమ్మాజాన్ గాయాలతో సంఘటన స్థలంలోనే మృతిచెందారు. మిగిలిన ఇద్దరు స్వల్పగాయాలతో బయట పడ్డారు. మృత దేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పారిశుద్ధ్య కార్మికుడి మృతి



రెడ్డప్ప (ఫైల్)

మదనపల్లె రూరల్ : విద్యుత్తు షాక్‌తో సచివాలయ పారిశుద్ధ్య కార్మికుడు మృతిచెందిన సంఘటన పుంగనూరు మండలంలో జరిగింది. మండలం లోని చంద్రమాకులపల్లె గ్రామానికి చెందిన రెడ్డప్ప(55) స్థానిక సచివాలయంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. బుధవారం తన ఇంటికి సమీపంలోని మునగ చెట్టుపైకెక్కి ఆకు కోస్తుండగా ప్రమాదవశాత్తూ పక్కనే ఉన్న విద్యుత్తు తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. చెట్టుపై నుంచి కింద పడి అపస్మారక స్థితికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన అత్యవసర విభాగం వైద్యులు అప్పటికే రెడ్డప్ప మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకుని మృతుడి కుటుంబసభ్యులు విలపించారు. రెడ్డప్పకు భార్య శోభ, కుమార్తెలు శిరీష, శ్రీవిద్య ఉన్నారు. పుంగనూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

'మహానాడు' వేదిక వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన



మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐజీ కోయప్రవీణ్, ఎస్పీలు

కడప అర్బన్ : ఈ నెల 27, 28, 29వతేదీలలో సికె.న్నె పరిధిలోని పబ్బాపురంలో జరగనున్న 'మహానాడు' వేదిక వద్ద భద్రతా ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ డా.కోయ ప్రవీణ్, కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లా ఎస్పీలు ఈజీ.అశోక్‌కుమార్, వి.విద్యాసాగర్‌నాయుడు, అధిరాజ్‌సింగ్‌రాణా బుధవారం పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన వేదిక, ఫుడ్ కోర్ట్‌ల వద్ద చేపట్టాల్సిన బందోబస్తుపై సిబ్బందికి డీఐజీ దిశా నిర్దేశం చేశారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు సూచించారు. 'మహానాడు' కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

దువ్వూరు : మండలంలోని పెద్ద జొన్నవరంలోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 28 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ప్రొద్దుటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మల్లికార్జున తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం 17.5 క్వింటాళ్లు ఉంటాయని, వాటి విలువ రూ.79,542 ఉంటుందన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. డీటీ మల్లికార్జున ఫిర్యాదు మేరకు రేషన్ బియ్యం నిల్వ ఉంచిన కొండా శేఖర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు దువ్వూరు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.